క్లుప్తంగా

స్మృతి వనం పనుల పరిశీలన



పటమట(విజయవాడతూర్పు): నగరంలోని స్వరాజ్ మైదానంలో జరుగుతున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం పనులు త్వరితగతిన పూర్తిచేయాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. బుధవారం ఆయన స్మృతివనం పనులను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ అంబేడ్కర్ 125 అడుగుల ఎత్తయిన విగ్రహ నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయని, కారిడార్ చుట్టూ నిర్మిస్తున్న ప్రహరీ కూడా వేగవంతంగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రాంగణంలో లైటింగ్, గ్రానైట్, పాత్ వే, వాటర్ ఫౌంటైన్, వెహికల్ పార్కింగ్, ల్యాండ్ స్కేపింగ్, గ్రీనరీ, సుందరీకరణ తదితర పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. స్మృతివనంలో మ్యూజియం, థియేటర్ సందర్శించి అక్కడ సీలింగ్, ఎలక్ట్రిసిటీ పనులు, పెయింటింగ్ పనులను పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించామన్నారు. క్వాలిటీ కంట్రోల్ అధికారులు, ఏపీఐఐసీ అధికారులు, కేపీసీ ప్రాజెక్ట్ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

‘ఆ సేవలను దేవుడూ హర్షిస్తాడు’



మధురానగర్(విజయవాడసెంట్రల్): నీతిగా, నిస్వార్థంగా సేవలు చేసి తరించాలని, ధార్మిక, ఆధ్యాత్మికతను కాపాడవలసిన బాధ్యత ప్రతి దేవాలయ కమిటీ సభ్యుల మీద ఉంటుందని ప్రముఖ ఆధ్యాత్మిక, సామాజిక వేత్త వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యుడిగా నియమితులైన సిద్ధవటం యానాదయ్య, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ సభ్యులు కనకారావు అభినందన కార్యక్రమం అయోధ్యనగర్ నాయీ బ్రాహ్మణ వృత్తి కళాకారుల శిక్షణ కేంద్రంలో జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం కార్పొరేషన్ సభ్యులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు గొనుగుంట్ల యలమంద, నిడమానూరు యలమందరావు, యాల్లురి శ్రీనివాసరావు, వినుకొండ నాగరాజు, కందుకూరి మనోహర్ తదితరులు పాల్గొని మాట్లాడారు.

అమెరికా ఎకానమీపై విద్యార్థులకు అవగాహన



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యాన అమెరికన్ సొసైటీ, కల్చర్ అండ్ ఎకానమీ అనే అంశంపై అతిథి ఉపన్యాసం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో యూఎస్ఏకు చెందిన డాక్టర్ సురేఖ నేరెళ్ల ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఇండియన్ సొసైటీ కల్చర్ అండ్ ఎకానమీ, అమెరికన్ ఎకానమీకి ఉన్న సంబంధాన్ని తెలియజేశారు. అలాగే అమెరికాలో విద్యావిధానం, ఆరోగ్యం, సివిల్ రైట్స్ గురించి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వ్యక్తం చేసిన పలు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో అర్థశాస్త్ర విభాగం ఇన్చార్జి ఎన్జే సుకుమార్ పాల్గొన్నారు.

న్యాయవాదుల విధులు బహిష్కరణ



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): న్యాయవాదుల ఇళ్లపై ఎన్ఐఏ సోదాలు చేయడాన్ని ఖండిస్తూ బెజవాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం న్యాయవాదులు విధులు బహిష్కరించి, నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీబీఏ అధ్యక్షుడు కేబీ సుందర్ మాట్లాడుతూ పౌరుల హక్కులు, న్యాయం కోసం నిలబడే న్యాయవాదుల ఇళ్లపై ఎన్ఐఏ అధికారులు దాడులు, సోదాలు చేయడం సెక్షన్ 100, 160, 165, 41డీ ప్రకారం నిబంధనలను ఉల్లంఘించడమే అన్నారు. అనంతరం న్యాయవాదులు కోర్టు కాంప్లెక్స్ నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ప్లకార్డులతో ప్రదర్శనగా వెళ్లి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు సుంకర రాజేంద్రప్రసాద్, బీబీఏ మాజీ అధ్యక్షుడు వి.గురునాథం, జనరల్ కార్యదర్శి జున్న శ్రీధర్, గడ్డం రాజేశ్వరరావు, గంధం శ్రీను, ఆర్.గంగాభవానీ, కేఎస్ సుధాకరరాజు, పుప్పాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షేమంతో నిరుపేద బతుకుల్లో వెలుగులు

‘గడప గడపకు మన ప్రభుత్వం’లో మల్లాది విష్ణు



సమస్యలపై దివ్యాంగుడిని ఆరా తీస్తున్న ఎమ్మెల్యే విష్ణు, కార్పొరేటర్ దేవి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాల అమలుతో రాష్ట్రంలోని లక్షలాది నిరుపేద కుటుంబాలలో వెలకట్టలేని సంతోషాన్ని నింపుతున్నారని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 57వ డివిజన్ న్యూ రాజరాజేశ్వరీపేటలోని 237వ వార్డు సచివాలయ పరిధిలో బుధవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, స్థానిక కార్పొరేటర్ ఇసరపు దేవితో కలిసి ఆయన అపార్ట్‌మెంట్‌ల ప్రాంతంలోని 423 గడపలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల ఆరోగ్య సంరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వృద్ధులు, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న సింగ్‌నగర్ ఇందిరానాయక్‌నగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను సంప్రదించాలని తెలిపారు.

నాలుగేళ్లలో రూ.6 కోట్ల అభివృద్ధి

కార్పొరేషన్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఇక్కడి ఆర్ఆర్‌పేట ప్రజలు అత్యధిక మెజార్టీ అందించారని.. వారి ఆశలను ఎక్కడా వమ్ము చేయకుండా ఈ ప్రభుత్వం డివిజన్‌లో అన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని ఎమ్మెల్యే తెలిపారు. గత నాలుగేళ్లలో ఈ ఒక్క డివిజన్లోనే రూ.6 కోట్లతో అభివృద్ధి పనులు నిర్వహించడమే దీనికి నిదర్శనమన్నారు. ప్రధానంగా అమరావతి కాలనీ రోడ్లు, పోలీస్ స్టేషన్ రోడ్డు, సబ్ స్టేషన్ రోడ్డు, పద్మావతి ఎన్‌క్లేవ్ రోడ్డు, భాగ్యలక్ష్మి ఎన్‌క్లేవ్ రోడ్డు, గ్రేస్ స్కూల్ రోడ్డు, మసీద్ రోడ్డు, యాదవుల బజారు రోడ్డు నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేశామన్నారు. అలాగే 237వ సచివాలయ పరిధి అపార్ట్‌మెంట్లలో తాగునీరు, యూజీడీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. ఏఎంఓహెచ్ రామకోటేశ్వరరావు, ఏఈ(ఇంజినీరింగ్) అరుణ్ కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు బెజ్జం రవికుమార్, ఉమ్మడి వెంకట్రావ్, ఇసరపు రాజు, కాళ్ల ఆదినారాయణ, అలంపూర్ విజయ్, పఠాన్ నజీర్ ఖాన్, చెన్నారెడ్డి, శ్రీనివాసరెడ్డి,అంజిబాబు, చిట్టెమ్మ, రజియా, ప్రేమ్, రమణ, ఉత్తమ్, జగదీష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దర్గా అభివృద్ధికి ప్రభుత్వ సహకారం

ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా



ఎమ్మెల్సీ రుహుల్లాను సన్మానిస్తున్న దర్గా కమిటీ పెద్దల

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే మసీదులు, దర్గాలు అభివృద్ధి చెందుతున్నాయని చెప్పారు. గన్నవరం నియోజకవర్గం పరిధిలోని ముస్తాబాద్ గ్రామంలో 350 ఏళ్ల చరిత్ర కలిగిన ముస్తఫా వలి బాబా దర్గా కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ రుహుల్లాను సింగ్‌నగర్‌లోని ఆయన కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. దశాబ్దాల చరిత్ర కలిగిన ముస్తఫా వలి బాబా దర్గాలో అనేక సమస్యలు నెలకొన్నాయని, ప్రధానంగా దర్గాకు రోడ్డు మార్గం లేకపోవడం వల్ల భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయనకు వివరించారు. వారి సమస్యలను తెలుసుకున్న ఎమ్మెల్సీ రుహుల్లా సానుకూలంగా స్పందించి, దర్గా అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నుంచి తప్పకుండా సహాయం అందిస్తామని, గన్నవరం ఎమ్మెల్యే, వక్ఫ్‌బోర్డు అధికారులతో మాట్లాడి రోడ్డు మార్గం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ రుహుల్లాను ఇస్లాం సంప్రదాయం ప్రకారం సన్మానించి, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించాలని కోరుతూ ప్రత్యేక దువా చేశారు. దర్గా ముజావర్లు షేక్ మహిబుల్లాఖాన్, హుసేన్, వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ హఫీజుల్లా, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

నగరవాసుల ఆహ్లాదానికే పార్కులు



రిటైనింగ్ బ్యూటిఫికేషన్ పార్కు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కృష్ణలంక(విజయవాడతూర్పు): నగరవాసులకు అభివృద్ధితో పాటు ఆహ్లాదకర వాతావరణాన్ని అందించేందుకు వీఎంసీ ప్రణాళికబద్ధంగా పార్కులను అభివృద్ధి చేస్తోందని మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. కనకదుర్గ వారధి నుంచి రామలింగేశ్వర డీపీ స్టేషన్ వరకు 1.25కి.మీ పొడవున సుమారు రూ.7.8 కోట్ల వీఎంసీ, రూ.4.5 కోట్ల అర్బన్ గ్రీనరీ నిధులతో కృష్ణానది రిటైనింగ్ వాల్ వెంబడి నిర్మిస్తున్న రిటైనింగ్ బ్యూటిఫికేషన్ పార్కును బుధవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ట్రీ కెనాఫీ, వాకింగ్, సైక్లింగ్ ట్రాక్ రోడ్లు, బెస్మెంట్ పనులపై ఆరా తీశారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పార్కు అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు.

సీఎం ప్రత్యేక దృష్టి..

ఈ సందర్భంగా కమిషనర్ స్వప్నిల్ దినకర పుండ్కర్ మాట్లాడుతూ నదీతీరంలో సాయంత్రం వేళ కుటుంబ సభ్యులతో గడిపేందుకు రిటైనింగ్ బ్యూటిఫికేషన్ పార్కు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ పార్కుపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించడంతో పనులు వేగంగా సాగుతున్నాయన్నారు. ఒకేసారి 250 నుంచి 500 మంది వరకు వాకింగ్ చేసేందుకు సౌలభ్యంగా ఉండేలా వాకింగ్ ట్రాక్ నిర్మిస్తున్నామన్నారు. నాలుగు మీటర్ల వెడల్పులో సైక్లింగ్ ట్రాక్, దానికి అనుకుని 10 మీటర్ల వెడల్పులో ఆహ్లాదకరంగా ఉండేలా పార్కు నిర్మిస్తున్నామన్నారు. పార్కులో ఓపెన్ జిమ్, గ్రూప్ సిట్టింగ్ ప్లేస్, షేడెడ్ సిటింగ్ ప్లేస్ నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. పార్కు సందర్శకుల సౌకర్యార్థం భారీసంఖ్యలో వాహనాల పార్కింగ్‌కు అనువుగా స్థలాన్ని కేటాయించామని, పార్కు ఎంట్రన్స్, ఎగ్జిట్ పాయింట్ల వద్ద ఆకర్షణీయమైన ట్రీ ఫౌంటేన్ స్టైల్ ఆర్చి ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇంకా రాత్రి వేళ్లలో కళ్లు మిరిమిట్లు గొలిపేలా ఆర్చికి, వాకింగ్, సైక్లింగ్ ట్రాకింగ్‌లకు కాంతి వంతమైన లైటింగ్ ఏర్పాటు చేయనున్నామని వివరించారు.

ఫుట్‌పాత్ పనుల పరిశీలన..

అనంతరం బందరు రోడ్డులోని సబ్ కలెక్టర్ పెట్రోల్ బంక్ సమీపంలో జరుగుతున్న కారిడార్ ఫుట్ పాత్ నిర్మాణ పనులను పరిశీలించారు. నగరంలోని అన్ని ప్రధాన జంక్షన్లు అభివృద్ధి పరిచే విధంగా వీఎంసీ కృషి చేస్తోందన్నారు. బందరు రోడ్డుకు ఇరువైపులా 7 కి.మీ మేరకు రాష్ట్ర ప్రభుత్వ నిధులతో రూ.7.8 కోట్లతో కారిడార్ ఫుట్ పాత్ నిర్మాణ పనులను జరుగుతున్నాయని, ఇప్పటివరకు 3 కిలోమీటర్ల మేరకు పనులు పూర్తయ్యాయని, ఇంకా 3.7కి.మీ పనులు జరుగుతున్నాయన్నారు. ఈ పర్యటనలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఏ.ఎస్.ఎన్.ప్రసాద్, వి.చంద్రశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

శంకరన్ జయంతి, వర్ధంతులను ఘనంగా నిర్వహించాలి

మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆదర్శ ఉన్నతాధికారి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బడుగు వర్గాల సంక్షేమానికి తన జీవితాన్ని త్యాగం చేసిన ఎస్ఆర్ శంకరన్ జయంతి, వర్ధంతి కార్యాక్రమాలను ఏటా ఘనంగా జరపాలని మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అన్నారు. బుధవారం లెనిన్ సెంటర్‌లోని అంబేడ్కర్ భవన్‌లో ఎస్ఆర్ శంకరన్ జయంతి, వర్ధంతి కార్యక్రమాల నిర్వహణ కమిటీ ఏర్పాటుకు సన్నాహక సమావేశం జరిగింది. జల్లి విల్సన్ మాట్లాడుతూ ఎస్ఆర్ శంకరన్ వర్ధంతి అక్టోబర్ 7న, జయంతి 22న రాష్ట్ర మంతటా నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఎస్సీ కమిషన్ సభ్యుడు కాలే పుల్లారావు మాట్లాడుతూ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్‌ల అంతటి గొప్ప వ్యక్తిత్వం శంకరన్‌కు ఉందన్నారు.

ఎస్ఆర్ శంకరన్ మెమోరియల్ కమిటీ ఏర్పాటు..

సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ కన్వీనర్‌గా శంకరన్ మెమోరియల్ కమిటీ ఏర్పాటు చేశారు. ఇందులో మరో 30 మంది కో కన్వీనర్స్‌గా నియమించారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు, డీహెచ్‌పీఎస్ ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, కేవీపీఎస్ నాయకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై ‘చేరువ’తో అవగాహన

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సోషల్ మీడియా, సైబర్ నేరాలపై పోలీసు శాఖకు చెందిన చేరువ వాహనం ద్వారా అవగాహన కల్పించారు. చేరువ వాహనంలోని ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా ఏ విధంగా నేరాలు జరుగుతాయి వాటి నుంచి ఏ విధంగా జాగ్రత్తగా ఉండాల్లో పోలీసు శాఖ చిన్న చిన్న నాటికల ద్వారా వివరించింది. పోలీసు శాఖ తీసుకుంటున్న చర్యలు, సైబర్ నేరాలను అరికట్టేందుకు ఏ విధమైన జాగ్రత్తలు పాటించాలనే అంశాలపై సూచనలందించారు. వాటితో పాటుగా చిన్నారులకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ వంటి అంశాలను సైతం ఈ వాహనం ద్వారా అవగాహన కల్పించారు. యువతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపైనా వివరించారు. వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని రథం సెంటర్, కనకదుర్గానగర్ తదితర ప్రాంతాల్లో పాదచారులు, భక్తులు వీటిని ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో దిశా పోలీస్ స్టేషన్ పోలీస్ అధికారులు సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గున్నారు.

పర్యావరణహిత వస్తువులను వాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీదేవి

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ప్లాస్టిక్‌తో చేసిన వస్తువులను మనం నిత్యం ఉపయోగించడం వల్ల అనేక రకాల జబ్బులకు గురవుతామని అందువల్ల ప్లాస్టిక్ వినియోగాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించుకోవాలని పర్యావరణ వేత్త వి.శ్రీదేవి అన్నారు. స్థానిక రావిచెట్టు సెంటర్‌లోని జనశిక్షణ సంస్థాన్ కార్యాలయం ఆవరణలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వాడకం-పర్యావరణానికి ముప్పు అనే అంశంపై సదస్సు బుధవారం జరిగింది. శ్రీదేవి అతిథిగా హాజరై మాట్లాడారు. ప్లాస్టిక్ వల్ల పర్యావరణ కాలుష్యం జరుగుతోందన్నారు. ప్లాస్టిక్‌లో స్టైరీన్, బెంజీన్ వంటి విషపూరిత రసాయనాలుంటాయని, ఇవి మనిషి శరీరంలోకి ప్రవేశించి క్యాన్సర్, శ్వాసకోశ, కిడ్నీ, కాలేయ సంబంధ వ్యాధులను కలిగించే ప్రమాదం ఉందన్నారు. సాధ్యమైనంత వరకు ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండాలని సూచించారు. ప్లాస్టిక్ సంచులకు బదులుగా క్లాత్, పేపర్, జ్యూట్ బ్యాగ్స్‌ని ఉపయోగించాలన్నారు. జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ ఎస్.విద్యాకన్నా మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల కాలుష్యం ఎక్కువగా జరుగుతోందన్నారు. జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఏ.పూర్ణిమతో పాటుగా శిక్షణార్థులు పాల్గొన్నారు. ప్లాస్టిక్ వినియోగడానికి దూరంగా ఉంటామని సదస్సునకు హాజరైన వారు ప్రతిజ్ఞ చేశారు.

గౌతంరెడ్డిని కలిసి అనిల్‌బాబు



మధురానగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర మత్స్యకారుల సహకార సంఘాల సమాఖ్య లిమిటెడ్ చైర్మన్ అనిల్ బాబు బుధవారం ఏపీ ఫైబర్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పూనూరు గౌతంరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డాక్టర్ గౌతంరెడ్డి అనిల్‌బాబును శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నెల్లూరు వ్యాపారవేత్త శేషారెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బాల్ బ్యాడ్మింటన్ జట్టుకు ఎస్టీవీఆర్ విద్యార్థి



కార్తీక్‌ను సత్కరిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): కర్నూలు జిల్లా నంద్యాలలో జరిగిన 8వ సబ్ జూనియర్స్ స్టేట్ చాంపియన్ షిప్‌లో దుర్గాపురం ఎస్టీవీఆర్ నగర పాలక సంస్థ పాఠశాల విద్యార్థి పట్నాన కార్తీక్ అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించి జాతీయ సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ జట్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో కార్తీక్‌ను పాఠశాల సిబ్బంది ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఎంజీపీ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ జలసూత్రం వెంకట్రావు, పాఠశాల స్టాఫ్ సెక్రటరీ ఎస్వీ శ్యామ్ ప్రసాద్, ఆంగ్ల ఉపాధ్యాయురాలు కె.రాణి కలిసి కార్తీక్‌కు నగదు పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఎండీ ఇమ్రాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

షూటింగ్ బాల్ ఎన్టీఆర్ జిల్లా జట్టుకు..

దుర్గాపురం ఎస్టీవీఆర్ పాఠశాల విద్యార్థులు బి.హేమేంద్ర, పి. తనోజ్‌కుమార్, బి. రామ్‌చరణ్ ఎన్టీఆర్ జిల్లా షూటింగ్ బాల్ బాలుర జట్టుకు ఎంపికయ్యారు. అలాగే బాలికల విభాగంలో జి.రమ్య, పి.లలిత షేక్ కరిమున్నీసా, ఆర్.మానస ఎంపికయ్యారు. ఈ జట్లు ఈనెల 18వ తేదీ నుంచి 19వ తేదీ వరకు తిరుపతిలో జరగబోవు రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ షూటింగ్‌బాల్‌చాంపియన్‌షిప్‌పోటీలో పాల్గొంటాయి.

పేదల ఆరోగ్యానికి భరోసా

మధురానగర్(విజయవాడసెంట్రల్): నిరుపేదలకు సైతం కార్పొరేట్ విద్య, వైద్య అందించటంతో పాటు వారి ఆరోగ్యానికి భరోసా కల్పించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని 31వ డివిజన్ వైఎస్సార్‌సీపీ డివిజన్ ఇన్‌చార్జి పెనుమత్స సత్యం అన్నారు. స్థానిక 31వ డివిజన్‌లో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య సిబ్బందితో కలిసి ప్రజల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డివిజన్‌లో నూతనంగా మంజూరైన అభా ఆరోగ్య కార్డులను ఆరోగ్య సిబ్బందితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వ పథకాలు, సేవలను వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

15 నుంచి దసరా ఉత్సవాలు



దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రికను విడుదల చేస్తున్న కమిటీ చైర్మన్ గోకరాజు గంగరాజు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో మొగల్‌రాజుపురం సిద్దార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల మైదానంలో దసరా మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ గోకరాజు గంగరాజు, వైస్ చైర్మన్ చదలవాడ నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఐలాపురం హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 15 నుంచి 24 వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు. దసరా అంటే రాష్ట్రంలోనే విజయవాడ ప్రసిద్ధ గాంచిన పండుగ అన్నారు. మైసూర్ నగరాన్ని తలపించే విధంగా దసరా ఉత్సవాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అమ్మవారి దీక్షా పరులు, సామాన్య ప్రజలు వేర్వేరుగా అమ్మవారి దర్శనం నేరుగా చేసుకునేలా ఏర్పాటు చేస్తున్నామన్నారు. 15 నుంచి 24 వరకు జరిగే ఉత్సవాల్లో తొలిరోజు అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవిగా దర్శనమిస్తారన్నారు. 16న గాయత్రీదేవి, 17న అన్నపూర్ణాదేవి, 18న మహాలక్ష్మీదేవి, 19న శ్రీ మహాచండీ, 20న సరస్వతీ దేవి, 21న లలితా త్రిపుర సుందరీ, 22న దుర్గాదేవి, 23న మహిషాసుర మర్దిని, 24న రాజరాజేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారన్నారు. ఉత్సవాల్లో వేదపండితులు, ఘనాపాటీల పర్యవేక్షణలో శతచండీ మహారుద్రయాగం, కుంకుమార్చన జరుగుతాయన్నారు. అనంతరం ఆహ్వాన పత్రికను విడుదల చేశారు. సమావేశంలో జనరల్ సెక్రటరీ వైట్ల కృష్ణ, చలువాది మల్లికార్జునరావు, కొల్లి హారిక, బి. రాంప్రసాద్‌రెడ్డి, గ్రంథి రామసుబ్రహ్మణ్యం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి బాటలో కాలనీ



ఈడబ్ల్యూఎస్ కాలనీలో నిర్మాణంలో ఉన్న రోడ్డు




కాలనీలో నిర్మాణం పూర్తయిన రోడ్డు

పాయకాపురం(విజయవాడరూరల్): ఆర్థికంగా వెనుకబడిన ఈడబ్ల్యూఎస్ ప్రాంతం నేడు అభివృద్ధి పథంలో ముందుకు దూసుకుపోతోంది. విజయవాడ నగరానికి శివారు ప్రాంతమైన 63వ డివిజన్‌లో ఈడబ్ల్యూఎస్ (ఎకనమిక్ వీకర్స్ సొసైటీ) కాలనీ ఒకప్పుడు సమస్యలకు నిలయంగా ఉండేది. ఈ కాలనీలో మొత్తం 484 ప్లాట్లు ఉండగా వాటిలో 250 కుటుంబాల్లో దాదాపు 10వేల మంది నివసిస్తున్నారు. వారు తాగడానికి మంచి నీరు సదుపాయం లేకపోవడం, నడిచేందుకు కనీసం రోడ్లు సదుపాయంలేక పోవడంతో అనేక అవస్థలు పడేవారు. గత టీడీపీ పాలకుల దృష్టికి ఈ సమస్యలు అనేక దఫాలు స్థానికులు తీసుకెళ్లారు. అయినా వారు పట్టించుకోలేదు. దీంతో ఆ ప్రాంతంలోని సమస్యలను 2019లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మల్లాది విష్ణు దృష్టికి తీసుకెళ్లారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ ప్రాంతం అభివృద్ధికి కృషి చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే అయిన వెంటనే మల్లాది విష్ణు ఆ ప్రాంత ప్రజల అభీష్టం మేరకు అభివృద్ధి పనులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.

అభివృద్ధి పనుల తీరు ఇలా..

- ప్రజలు తాగేందుకు మంచినీటి సరఫరా కోసం సీఎండీఎఫ్ నిధులు రూ.40లక్షలతో పైపులైను నిర్మించి తాగునీటి సరఫరా సదుపాయం కల్పించారు.
- 15వ ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ. 80లక్షలతో ఆహ్లాదకరమైన వాతావరణం కోసం పార్కు నిర్మించి జిల్లా ఇన్‌చార్జి మంత్రి తానేటి వనితతో ప్రారంభింపజేశారు.
- ప్రస్తుతం విజయవాడ నగరపాలక సంస్థ సాధారణ నిధులు కోటి రూపాయలతో సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. 4, 5 రోడ్ల పనులు పూర్తికాగా, 6, 7 రోడ్ల పనులు జరుగుతున్నాయని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాస్ తెలిపారు.
- ఎన్నడూలేని విధంగా ఈడబ్ల్యూఎస్ కాలనీలో అభివృద్ధి పనులు జరగడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


అభివృద్ధి పరుగులు..



గత పాలకుల నిర్లక్ష్యానికి గురైన ఈడబ్ల్యూఎస్ కాలనీ నేడు అభివృద్ధి దిశగా ముందుకెళుతోంది. ఎమ్మెల్యే మల్లాది విష్ణు కృషితో డివిజన్లో అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న పనులు వేగంవంతంగా పూర్తి చేసేందుకు ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తున్నాం.

– మోదుగుల తిరుపతమ్మ, కార్పొరేటర్

ఎవరూ పట్టించుకోలేదు..



అనేక సమస్యలతో ఉన్న ఈడబ్ల్యూఎస్ కాలనీ నేడు అభివృద్ధి పనులతో కొత్త పుంతలు తొక్కుతోంది. గత ప్రభుత్వాలు అసలు మా కాలనీ పట్టించుకోలేదు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే ప్రత్యేక కృషితోనే అభివృద్ధి జరుగుతోంది.

– పూళ్ల వెంకట చలపతి, స్థానిక నివాసి

సమాజాన్ని ఆవిష్కరించేవి కార్టూన్లు



సర్టిఫికెట్లను అందిస్తున్న గోపిశెట్టి మల్లయ్య

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సమాజాన్ని దగ్గరగా ఆవిష్కరించే శక్తి కార్టూన్లకు ఉంటుందని ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్స్ కమిటీ ప్రధాన కార్యదర్శి గోపిశెట్టి మల్లయ్య అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల కోసా, ఉమెన్ స్టడీ సెంటర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కార్టూన్స్ వేయటంపై శిక్షణ శిబిరాన్ని ఆ కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం జరిగిన ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గోపిశెట్టి మల్లయ్య విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చాలా స్వల్ప మాటలతో, చిట్టిచిట్టి బొమ్మలతో అద్భుతమైన సందేశాన్నిందించటమే కాకుండా ఆలోచింపజేసేలా చేయొచ్చన్నారు. మానవ జీవితంలోని చాలా అంశాలను కార్టూనిస్టులు అద్భుతంగా వేసి సమాజాన్ని జాగృతం చేస్తున్నారని వివరించారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజీఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ అధ్యక్షుడు చలవాది మల్లికార్జునరావు, కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన గణపతి మహోత్సవాలు

మధురానగర్: మధురానగర్ నేతాజీ కాలనీలోని శ్రీ గణపతి నవరాత్రి మహోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. నాగ గణపతిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఉంచి మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, తీన్‌మార్ నృత్యాలలో మహిళలు కోలాటం చేస్తూ ఊరేగింపు సాగింది. తొలుత లడ్డూ వేలం, పూజలు జరిగాయి. కార్యక్రమాలను బోనం నాగు ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు పర్యవేక్షించారు.